పేదల ఆరోగ్యానికి భరోసా

- ఆరోగ్య కేంద్రాల్లో మరిన్ని వైద్య సేవలు
- అందుబాటులోకి రక్త పరీక్షలు



కంచరపాలెం ఆరోగ్య కేంద్రంలో రక్త నమూనా సేకరిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



మహిళకు సూచనలిస్తున్న వైద్యాధికారి శశిప్రియాంక

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి. వీటితోపాటు మరిన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు 18 రకాల రక్త పరీక్షలు, 55 రకాల ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కంచరపాలెం ఆర్పీ పేట, జ్ఞానాపురం, కప్పరాడ, రాంజీ ఎస్టేట్ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న వైద్య పరీక్షలకు అదనంగా మరో 8 రకాల పరీక్షలను ప్రభుత్వం ప్రజల ముందుకు తెచ్చింది.

24 గంటల్లో ఫలితాలు..

కంచరపాలెం పీహెచ్‌సీకి ప్రతి రోజు 80 నుంచి 140 మంది వరకు రోగులు వస్తుంటారు. ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్లు, రక్త పరీక్షలకు కావాల్సిన ల్యాబ్ సామగ్రిని అందుబాటులో ఉంచారు. రోగులకు సంబంధించి రక్త నమూనాలను సిబ్బంది సేకరించి 24 గంటల్లో ఫలితాలను తెలియజేస్తారు. ఈ పరీక్షల వల్ల రోగికి నగదు ఆదా అవడమే కాకుండా శ్రమ కూడా తగ్గుతుంది.

రక్త పరీక్షల వివరాలు..

- టీఎస్‌సీ(తెల్ల రక్త కణాల లెక్కింపు)
- డీఎస్‌సీ(ఐదు రకాల రక్త కణాలకు సంబంధించిన పరీక్ష)
- ప్లేట్‌లెట్స్ కౌంట్
- ఎస్.బిలిరూబిన్(కామెర్లు)
- ఆర్‌పీఆర్
- డెంగ్యూ ర్యాపిడ్ టెస్ట్
- స్టూల్ ఫర్ ఓవా అండ్‌సిస్ట్ (విరేచనాలకు సంబంధించి)
- టీబీ అండ్ డాట్స్(క్షయకు సంబంధించి పరీక్షలు)

వైద్య సేవలు అందుతున్నాయి



రక్త పరీక్షల నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే వందల రూపాయల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. చిన్న విషయానికి రకరకాల పరీక్షల పేరుతో డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఈ స్థితిలో ప్రభుత్వం పేదోడికి ఉచితంగా వైద్య పరీక్షలు అందించడం ఆనందంగా ఉంది.

– ప్రదాన భవాని, కంచరపాలెం రాజీవ్ కాలనీ

అన్ని పరీక్షలూ ఉచితమే



ఆరోగ్య కేంద్రాల్లో అన్ని వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. రక్త శాతం, మలేరియా, ఇన్ఫెక్షన్, చక్కెర, హెచ్ఐవీ, గళ్ల పరీక్ష, కిడ్నీలు, గర్భ నిర్ధారణ, కాలేయం, టైఫాయిడ్‌తో కామెర్లు, డెంగ్యూ తదితర పరీక్షలన్నీ ఉచితంగానే జరుగుతాయి.

– డాక్టర్ మట్టా శశిప్రియాంక, వైద్యాధికారి, కంచరపాలెం ఆరోగ్య కేంద్రం

మర్యాదపూర్వక కలయిక



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీధర్

గ్లోబల్ ఇన్వెస్టర్ సదస్సులో పాల్గొనేందుకు గురువారం నగరానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్థానిక నేతలు ఘన స్వాగతం పలికారు. రుషికొండ రాడిసన్ బ్లూ హోటల్‌లో బసచేసిన సీఎం జగన్‌ను విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఎస్‌బీసీ బ్రిడ్జి మీదుగా వాహనాలను అనుమతించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: డాక్‌యార్డ్ బ్రిడ్జి మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు ప్రస్తుతానికి ఎస్‌బీసీ బ్రిడ్జి నుండి వాహనాలకు అనుమతులు ఇవ్వాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై మల్కాపురం బస్టాప్ వద్ద గురువారం ఉదయం నిరసన చేపట్టారు. డాక్‌యార్డ్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవటంతో 15 నెలల వ్యవధిలో మరమ్మతు చేసేందుకు అధికారులు నిర్ణయించారన్నారు. ఈ కారణంగా బ్రిడ్జి మూసివేత జరిగితే మల్కాపురం, శ్రీహరిపురం, సింధియా తదితర ప్రాంతీయులు నగరానికి వెళ్లాలంటే వీడీఆర్ గొడౌన్స్ మీదుగా మారుతీ సర్కిల్, షీలానగర్ వంతెన మీదుగా నగరానికి చేరుకోవాల్సి వస్తుందన్నారు. దీని వలన దూరం పెరగడంతో పాటు వత్తిడి, ధూళి బారిన పడతారన్నారు. డాక్‌యార్డ్ వంతెన పక్కన గల ఎస్‌బీసీ బ్రిడ్జి నుండి ప్రజా వాహనాలకు అనుమతి ఇస్తే ఆ సమస్య ఉండదన్నారు. దీనిపై ఈ నెల 6న కలెక్టర్ కార్యాలయం ఎదుట తమ నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. దీనికి అంతా సహకరించాలని కోరారు. పార్టీ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, పెంటారావు, పైడిరాజు, జనార్దన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పన్నులు చెల్లించి సహకరించిండి

- జోన్–8 కమిషనర్ మల్లయ్యనాయుడు

గోపాలపట్నం: జీవీఎంసీకి ఆస్తి పన్నులు, కుళాయి పన్నులు, యూజర్ చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ వంటివి సకాలంలో చెల్లించి సహకరించాలని జోన్–8 కమిషనర్ మల్లయ్యనాయుడు ఒక ప్రకటనలో కోరారు. 2022–23 ఏడాదికి గానూ ఈ నెల 31తో పన్నులు చెల్లింపు సమయం ముగియనుందన్నారు. ఈ లోగా బకాయిలు ఉన్నవారు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. జోన్–8 కార్యాలయంలో ఈ నెల రోజుల పాటు సౌకర్యం కౌంటర్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు, సెలవు దినాల్లో కూడా కౌంటర్ తెరిచి ఉంటుందన్నారు. జోన్ పరిధిలో ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్సీ విజ్ఞప్తి చేశారు.

గోపాలపట్నం ఆస్పత్రిలో పండ్ల పంపిణీ



పండ్లు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రిలో గీతా ఛానల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వ్యాధిగ్రస్తులకు పండ్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విజయకుమార్‌శర్మ మాట్లాడుతూ తమ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందుకు సహకరించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యుడు హర్షవర్ధన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోన వెంకటరావు, జి.రామదాసు, అప్పారావు, లోకేష్, సన్యాసిరావు పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న కార్పొరేటర్ సురేష్

మల్కాపురం: ధ్యానం చేయడం ద్వారా ఎంతటి ఒత్తిడినైనా జయించవచ్చని 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ అన్నారు. అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో భగవాన్ బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశీస్సులతో స్థానిక సన్‌రైజ్ పాఠశాలలో ఉచిత ధ్యాన శిక్షణ–జ్ఞాన బోధన కార్యక్రమం రెండో రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమంలో పాల్గొని వారితో కలిసి 30 నిమిషాల పాటు దైవ ధ్యానం చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడి ఉన్నవారు నిత్యం ధ్యానం చేస్తే మంచిదన్నారు. ధ్యానం మనిషిని ఆరోగ్యవంతుడిగా తీర్చిదిద్దుతుందన్నారు. 45 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు పర్యవేక్షించారు.

749వ రోజుకు ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు గురువారానికి 749వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్–1 విభాగానికి చెందిన కార్మికులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు నేటికీ దీనస్థితిలో ఉన్నాయని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి, ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటే మంచిదని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమిస్తున్నట్లు రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రకటించాలని, లేదంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సర్వీస్ రోడ్డుకు మరమ్మతులు



మల్కాపురం సర్వీస్ రోడ్డులో విద్యుత్ సిబ్బంది తవ్వి వదిలేసిన గోతులు(నాడు)



గోతులు పూడ్చిన అనంతరం రహదారి(నేడు)

ట్రాఫిక్ ఎస్ఐ చొరవతో గోతుల పూడ్చివేత

మల్కాపురం: స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ చొరవతో రహదారి బాగుపడింది. నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగించే సర్వీస్ రోడ్డు అది. విద్యుత్ సిబ్బంది చేపట్టిన పనుల వల్ల ఆ దారిలో గోతులు ఏర్పడ్డాయి. వాటిని పూడ్చకుండా వదిలేయడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గుర్తించిన స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఇది గమనించిన స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ చొరవ చూపి సర్వీస్ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. వివరాలిలా.. 61వ వార్డు మల్కాపురంలో ఎస్‌బీఐ బ్రాంచ్ ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డులో విద్యుత్ శాఖ సిబ్బంది భూగర్భ విద్యుత్ కేబుల్ వైర్ల ఏర్పాటు కోసం గత నెలలో గోతులు తవ్వారు. పనులు పూర్తయ్యాక వాటిని సక్రమంగా పూడ్చకుండా అలాగే విడిచిపెట్టి వెళ్లిపోయారు. దీంతో ఆ మార్గాన ప్రయాణించిన వాహన చోదకులు, పాదచారులు అవస్థ పడటంతోపాటు పలు వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. వాహన చోదకుల ఇబ్బందిని గుర్తించిన మల్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శన్ సమస్య పరిష్కారానికి ముందుకొచ్చారు. బుధ, గురువారాల్లో కాంక్రీట్ మిక్సింగ్ వాహనం ద్వారా సిబ్బందితో సర్వీస్ రోడ్డులో మరమ్మతులు చేయించి గోతుల పూడ్చివేత చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు, వాహన చోదకులు ట్రాఫిక్ ఎస్ఐకు కృతజ్ఞతలు తెలిపారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



పద్మనాభనగర్‌లో కరపత్రం అందిస్తున్న బెహరా భాస్కరరావు



58వ వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ లావణ్య



షిప్‌యార్డ్ స్కూల్‌లో కరపత్రాలు అందిస్తున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. 92వ వార్డులో గురువారం జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా బాస్కరరావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. పద్మనాభ నగర్, ఎస్సీబీఈ కాలనీ, ఆర్‌ఆర్‌వీ పురం, అజంతా పార్క్, బాపూజీ నగర్, టైలర్స్ కాలనీ, వుడా కాలనీ ప్రాంతాల్లో పట్టభద్రులను కలిసి వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివారావు, అప్పల స్వామి, కంపర కోటేశ్వరరావు, గేదెల మురళీకృష్ణ, కంపర సత్తిబాబు, కన్నారావు, నాగూర్ పాల్గొన్నారు.

58, 61 వార్డుల్లో..

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెంలో కార్పొరేటర్ గులిగిందల లావణ్య ప్రచారం చేశారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా 61వ వార్డు మల్కాపురంలో కార్పొరేటర్ కొణతాల సుధ పట్టభద్రులవద్దకు వెళ్లి గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ నాయకులు దాడి సత్యనారాయణ, కొల్లి నూకరెడ్డి, చట్టి నూకరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ నాయకుల ప్రచారాలు

సింధియా: సింధియా జంక్షన్‌లోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ పరిశ్రమ వద్ద టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మద్దతు అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు మద్దతుగా ఆ పార్టీ నాయకులు కార్మికులను కలిశారు. చిరంజీవిరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కరపత్రాలను అందజేశారు. ఎం.వి.రమణమూర్తి, రమేష్, మురళీ, రామకృష్ణ, జైకుమార్, చిన్నాజీ, కూర్మారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

- బీజేపీ మద్దతు అభ్యర్థి పి.వి.ఎన్.మాధవ్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ములకలపల్లి ప్రకాష్ నేతృత్వంలో షిప్‌యార్డ్ స్కూల్, స్థానిక జీవీఎంసీ పాఠశాల, ఒడియా స్కూల్, ఈఎస్ఐ ఆస్పత్రిలో ప్రచారం చేసి ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, గ్రాడ్యుయేట్లను కలిసి కరపత్రాలను అందజేశారు. ఆర్.ఎస్.ఎస్.శ్రీనివాస్, వసుంధర, రవి, శ్రీను పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చన సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజతోపాటు త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో రుసుం చెల్లించవచ్చు.

కళలతో సమాజంలో గుర్తింపు

ఆరిలోవ: కళలు సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు తీసుకొస్తాయని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ అన్నారు. దీనదయాళ్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహంలో నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు నవరస మూర్తి బాలురకు నెల రోజుల పాటు నటనలో ఇచ్చిన శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన 'తప్పు తెలిసింది' నాటికను బులికృష్ణ ఆసక్తిగా తిలకించారు. అనంతరం బాలురకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బులికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు కళల్లో ప్రావీణ్యం పొందడం ఎంతైనా అవసరమన్నారు. నటనలో శిక్షణ పొందిన విద్యార్థులు మంచి సందేశాత్మకమైన నాటిక ప్రదర్శించారని అభినందించారు. గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్య, అతిథులు తలసాని కృష్ణప్రసాద్, అబ్దుల్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే క్రాసింగ్ సమస్య పరిష్కారానికి కృషి



ఆర్పీ పేట రైల్వే గేటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

కంచరపాలెం: స్థానిక రామ్మూర్తిపంతులుపేట రైల్వే క్రాసింగ్ సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలని సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ సూచించారు. గవర కంచరపాలెం, గొల్లకంచరపాలెం ప్రాంతాలకు ఆనుకుని ఉన్న రైల్వే క్రాసింగ్ రక్షణ గోడను గురువారం ఆయన పరిశీలించారు. స్థానికులు సమస్యను వివరించారు. దయానందనగర్, చాకలిగెడ్డ, రాజీవ్ కాలనీ, ముత్యమాంబ కాలనీ, గవర కంచరపాలెం, ఆర్పీపేట ప్రాంతాల ప్రజలు కంచరపాలెం జంక్షన్‌కు రాకపోకలు సాగించడానికి ఇక్కడి మార్గం సులభంగా ఉంటుందని, రైల్వే భద్రత పేరిట అధికారులు రక్షణ గోడ నిర్మించడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందించారు. రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. జేడీ ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు సర్వసిద్ధి గౌరీశంకర్, పిన్నమనేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జీవీఎంసీ స్కూల్ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: ప్రకృతి ధర్మమైన గొలుసు కట్టు విధానంలో మనిషి, భూగోళం మనుగడకు వన్యప్రాణుల సంరక్షణ అత్యంత అవసరమని గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపకుడు జేవీ రత్నం అన్నారు. ఈ నెల 3న 50వ వన్యప్రాణి దినోత్సవ నినాదాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సంస్థ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని సెవెంత్ డే ఎడ్వంటరిస్ట్ స్కూల్, ఏఎస్ రాజా మహిళల జూనియర్ కళాశాల, శివాజీపాలెం జీవీఎంసీ ప్రైమరీ పాఠశాలల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీ రత్నం మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన 'వన్యప్రాణుల సంరక్షణ కోసం భాగస్వాములు కండి' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఏయూ సోషల్ వర్క్ విద్యార్థిని మెడగాస్కర్, ఏఎస్ రాజా కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, శివాజీపాలెం జీవీఎంసీ స్కూల్ హెచ్ఎం బీకేడీ కుమారి తదితరులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని వన్యప్రాణి సంరక్షణపై ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు.

సిబ్బందికి సమయపాలన ముఖ్యం

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమయపాలన పాటించాలని, ఎఫ్ఆర్ఎస్ హాజరు, బయోమెట్రిక్ వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. పీఎం పాలెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో రిజిస్టర్లు తనిఖీ చేశారు. మందుల నిల్వను పరిశీలించారు. గర్భిణులకు ప్రయాణ సదుపాయం కల్పించాలని, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. వైద్యులు శశిభూషణ్, బి.నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



ర్యాలీలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: చిన్న వయసులోనే పిల్లలకు వివాహాలు చేయడం నేరమని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అన్నారు. 'బాల్యంలో పెళ్లిళ్లు – భావితరాలకు ఉరితాళ్లు' నినాదంతో వార్డు పరిధిలోని గిరిజా కాలనీ సామాజిక భవనంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బాలబాలికలకు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం వల్ల వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కో–ఆర్డినేటర్ నిఖిల, కమ్యూనిటీ మొబిలైజర్ ధనలక్ష్మి, వెల్ఫేర్ సెక్రటరీ ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకులు మంగునాయుడు, దేముడు, పెంద్ర రాజు, ప్రవీణ్, జాన సతీష్, ఆర్మీ సతీష్, వలంటీర్ జగదీష్ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మర్రిపాలెం: ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి కంచరపాలెంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ఓల్డ్ రామారావు హాస్పిటల్ వద్ద కల్లూరి చందు(21) అనే యువకుడు తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. వారు రజక వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నారు. యువకుడికి మద్యం తాగే అలవాటు ఉంది. బుధవారం అర్ధరాత్రి ఎంతసేపటికీ భోజనానికి రాకపోవడంతో అనుమానం వచ్చి తల్లిదండ్రులు చూసేసరికి గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. అతడిని కిందకి దింపి ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. అప్పటికే మరణించినట్టు డాక్టర్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

మర్రిపాలెం: కంచరపాలెం పరిధిలో ఓ వ్యక్తి కాలువలో పడి మృతిచెందిన ఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ దరి శ్రీనివాసనగర్‌లో సామిరెడ్డి చిట్టిబాబు(57) అనే వ్యక్తి నివసిస్తున్నాడు. ఇతడు గతంలో పోర్టు ఉద్యోగిగా పనిచేసి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. మద్యం తాగే అలవాటు ఉంది. ఇంటి నుంచి బుధవారం ఉదయం మెట్ల మార్గం గుండా బయటకు వచ్చే క్రమంలో కాలువలో పడిపోయాడు. బంధువులు, చుట్టుపక్కల వారు ఆస్పత్రిలో చేర్పించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఆ ప్రాంతవాసులు తెలిపిన సమాచారం మేరకు పోలీసులు సమీక్షించారు. గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



సింహాచలం కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఆడారి శ్రీను, పల్లా ఎర్నికుమార్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెంలో గుండాల సింహాచలం ప్రమాదంలో మరణించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు సింహాచలం కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్ యాదవ్, సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ సూర్యనారాయణ, అడ్మిన్ అశోక్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.